క్లుప్తంగా

తెలుగు మహాసభల్లో 'కిలారి'కి సన్మానం



గౌరినాయుడుకు సన్మానిస్తున్న సాహితీవేత్తలు

లక్కవరపుకోట: విజయవాడలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో కిత్తన్నపేట గ్రామానికి చెందిన యువ సాహితీవేత్త కిలారి గౌరినాయుడును ఘనంగా సన్మానించారు. గౌరినాయుడు పర్యావరణాన్ని కాపాడుకుందాం.. అనే అంశంపై రచించి స్వీయ కవితను గానం చేసి, కథా సాహిత్యంపై ప్రపంచీకరణ ప్రభావం అనే అంశంపై ప్రత్యేక ప్రసంగం చేశారు. ఇందుకుగాను ప్రపంచ తెలుగు మహాసభల అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు తదితరులు సన్మానించి మెమెంటోను అందజేశారు. గౌరినాయుడును పలువురు అభినందించారు.

32 అర్జీల స్వీకరణ

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి, ఎస్.కోట సీతారాంపురం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 32 అర్జీలను స్వీకరించినట్లు తహసీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతాంగం వినియోగించుకోవాలని ఆమె కోరారు. కొండగంగుబూడిలో 22, ఎస్.కోట సీతారాంపురంలో 10 భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రామలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు



విద్యార్థులకు సంకల్పం రథం ద్వారా అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొత్తవలస: మండలంలోని పలు కళాశాలల్లో సీఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, సైబర్ మోసాలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయనగరం జిల్లా కేంద్రం నుంచి వచ్చిన సంకల్పం రథంలో దృశ్య అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారి జీవితాలు ఎంత దుర్భరంగా మారుతాయో అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై చైతన్యపరిచారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. పోలీసు సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గజపతినగరం: మండలంలోని వేమలి గ్రామంలో సోమవారం నిర్వహించిన 104 వైద్యశిబిరంలో 59 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి పుష్పాంజలి రోగులను పరీక్షించారు. ఆరోగ్య సూత్రాలపై అవగాహన కలిగించారు. వైద్య సిబ్బంది తమ వంతు సేవలు అందించారు.

అందరి సహకారంతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



స్టాపర్లను ప్రారంభిస్తున్న సీఐ షణ్ముఖరావు, కర్మాగార ప్రతినిధులు

కొత్తవలస: అందరి సహకారంతోనే రహదారి ప్రమాదాల నివారణ సాధ్యమని సీఐ షణ్ముఖరావు అన్నారు. కంటకాపల్లి గ్రామ సమీపంలోని శారద మెటల్స్ అండ్ ఎల్లాయిస్ కర్మాగారం సీఎస్ఆర్ ఫండ్‌లో భాగంగా పది రోడ్డు స్టాపర్లను వితరణగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలోని అరకు – విశాఖ రోడ్డు, కొత్తవలస – విజయనగరం రోడ్డులో ప్రమాద స్థలాలను గుర్తించామన్నారు. ఆయా ప్రాంతాల్లో ఈ స్టాపర్లను పెడతామన్నారు. శారద కర్మాగారం ప్రతినిధులు సన్యాసిరావు, మనోజ్‌కుమార్, ప్రదీప్‌కుమార్, జయశ్రీ, పవన్‌మిశ్ర, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తీరిన 'భోజన' నిర్వాహకుల సమస్య

శృంగవరపుకోట: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ నేతృత్వంలో సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ డీఈఓకి రిఫర్ చేసి సమస్య తక్షణం పరిష్కరించాలని ఆదేశించటంతో ఎస్.కోట ఎంఈఓకు ఫోన్ చేసి తొలగించిన మధ్యాహ్న భోజన నిర్వాహకులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సూచించారు. దీంతో సీఐటీయూ నేత మద్దిల రమణతో పాటూ భోజన కార్మికులు స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ నర్సింగరావును కలిశారు. దీంతో ఎంఈఓ ఆయా స్కూళ్లలో ఎండీఎం ఏజెంట్లకు ఫోన్ చేసి తొలగించిన వర్కర్లను యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలని, ప్రస్తుతం వస్తున్న వేతనాలను అడ్జస్ట్ చేసుకోవాలని సూచించారు. రమణ మాట్లాడుతూ అడ్జస్ట్‌మెంట్‌లు కుదరవని లేకుంటే భవిష్యత్‌లో ఉద్యమిస్తామని చెప్పారు.

కొత్త ఆలోచనలు.. సరికొత్త ఆవిష్కరణలు



కొత్త కొత్తగా..

చీపురుపల్లి: పాఠశాలల స్థాయిలో ఈ నెల 28న ఉత్తమంగా ఎంపికై న ప్రాజెక్టులను మండల స్థాయిలో సోమవారం దక్షిత భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని గురుకుల కళాశాలలో నిర్వహించారు. ఏపీ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ రాణిశ్రీ, ఎంఈఓ ఎం.బూసినాయుడు ప్రారంభించారు. పాఠశాల స్థాయిలో ఉత్తమంగా నిలిచిన 12 ప్రదర్శనలను విద్యార్థులు ఎగ్జిబిట్ చేశారు. విద్యార్థుల కొత్త ఆలోచనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

చిన్నారులు కొత్త ఆలోచనలతో.. సరికొత్త ఆవిష్కరణలతో ఆలోచింపజేస్తున్నారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల్లో భాగంగా పాఠశాలల విద్యార్థులు సోమవారం మండల స్థాయిలో పలు ప్రాజెక్టులను ఎగ్జిబిట్ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు భావితరాలకు నూతన ఆలోచనలు కలిగించే దిశగా ఆలోచింపజేశాయి. భవిష్యత్ సైన్స్‌తే అన్నట్టు పలు ప్రాజెక్టులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.



వినూత్న ఆవిష్కరణలు

గుర్ల: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో సైన్స్ ప్రదర్శనలను పలువురు సందర్శించారు. వీటిని చూసిన పలువురు భవిష్యత్‌లో విద్యార్థులు సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఎంఈఓలు ఎస్.భానుప్రకాష్, శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, బెల్లాన బంగారునాయుడు తదితరులు ప్రాజెక్టులను పరిశీలించారు.

ప్రయోగాత్మక బోధనతో సత్ఫలితాలు

లక్కవరపుకోట: విద్యార్థులకు ప్రయోగాత్మక బోధనలు చేయడం ద్వారా సత్ఫలితాలు సాధ్యమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. లక్కవరపుకోట మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన సోమవారం నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పలు ప్రాజెక్టులను తిలకించి విద్యార్థులను అభినందించారు. ఎంఈఓలు సీహెచ్ కూర్మారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.





కొత్త ఆలోచనలు

మెరకముడిదాం: మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన మెరకముడిదాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగింది. 19 పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారు. ఎంఈఓలు చంద్రశేఖర్, ధర్మశ్రీను, ఉపాధ్యాయులు పరిశీలించారు. విద్యార్థుల ఆలోచనలను అభినందించారు.



అలరించిన విజ్ఞాన ప్రదర్శన

కొత్తవలస: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని ఎంఈఓ జి.శ్రీదేవి ప్రారంభించారు. విద్యార్థులు పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. పాఠశాల హెచ్ఎంలు సీహెచ్ ఈశ్వరరావు, జి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

వేపాడ: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ఎంఈఓలు జి.జగదీశరావు, బి.బాలభాస్కర్‌రావు ఆధ్వర్యంలో దీన్ని చేపట్టారు. జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఎంపీడీఓ సూర్యనారాయణ, వేపాడ, నీలకంఠరాజుపురం హెచ్ఎంలు శ్రీవల్లి, వెంకటరావు విద్యార్థులు రూపొందించిన పలు ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు.



ప్రదర్శనలు భేష్

గజపతినగరం: గజపతినగరం బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన మండల హైస్కూళ్ల స్థాయి విజ్ఞాన ప్రదర్శన ఆలోచింపజేసింది. ప్రదర్శనలను ఎంఈఓ విమలమ్మతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తిలకించారు. ఉత్తమ ప్రదర్శనలు జిల్లా స్థాయికు వెళ్లనున్నాయి. ఎంఈఓ 2 సాయిచక్రధర్, హెచ్ఎం చిప్పాడ రమేష్‌కుమార్, ఎం.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మేధోశక్తికి దోహదం

చీపురుపల్లి రూరల్(గరివిడి): వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల మేధోశక్తికి దోహదం చేస్తాయని పలువురు పేర్కొన్నారు. గరివిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. ఉత్తమ ఎంపికలను జనవరి 3న నిర్వహించనున్నారు. ఎంఈఓలు పి.రామారావు, డి.అప్పన్న, మాజీ ఎంపీపీ పైల బలరాం, ఉప సర్పంచ్ బమ్మిడి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన మేళా



శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విజ్ఞానమేళా సోమవారం ఎంఈఓ పీజీ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. మేళాను ఎమ్మెల్యే లలితకుమారి ప్రారంభించారు. విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టులను ఆసక్తిగా తిలకించారు. న్యాయ నిర్ణేతలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు ఆర్.కిషోర్‌కుమార్, జి.ఉమామహేశ్వరరావు వ్యవహరించారు. ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, సర్పంచ్ జి.సంతోషికుమారి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణతో ప్రాణ రక్షణ

గజపతినగరం నియోజవర్గ కేంద్రంలోని (సర్కిల్ పరిధిలో ఉన్న) పోలీస్ అధికారులంతా బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలని సూచించారు. తెలుగు రాష్ట్రాలలో హెల్మెట్ వినియోగం తక్కువగా ఉందన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గజపతినగరం పోలీస్‌స్టేషన్ నుంచి బొండపల్లి మండల కేంద్రం వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీఐ జీఏవీ.రమణ, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, మహిళా పోలీస్‌లు, సిబ్బంది పాల్గొన్నారు. – గజపతినగరం



అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో ప్రదర్శన

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షాను తక్షణమే ఆ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ సంఘాలు సోమవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసారు. అనంతరం మూడు రోడ్ల జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ కేంద్ర మంత్రి అమిత్‌షా రాజీనామాకు డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా క్షమాపణలు చెప్పాలన్నారు. సంఘ నాయకులు టీవీ రమణ, ఎ.గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు. – చీపురుపల్లి



శరవేగంగా బిళ్లలవలస రహదారి పనులు

• ఎట్టకేలకు స్పందించిన అధికారులు



శరవేగంగా నిర్మితమవుతున్న బిళ్లలవలస - చీపురుపల్లి ప్రధాన రహదారి



ఆగస్టు 27న సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్...

మెరకముడిదాం: మండలంలోని గర్భాం – గరివిడి ప్రధాన రహదారి నుంచి బిళ్లలవలస మీదుగా చీపురుపల్లి వెళ్లే ప్రధాన రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 14.905 కిలోమీటర్ల మేర పొడవు వున్న ఈ రహదారి పనులను 8 కోట్ల 76 లక్షల రూపాయలతో నిర్మిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ రహదారి నిర్మాణానికి నిధులను అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంజూరు చేయించారు. అయితే అప్పట్లోనే ఈ రహదారి పనులను ప్రారంభించి కొంత మేర పనులు కూడా పూర్తి చేశారు. అయితే అప్పటికి అయిన పనులకు సంబంధించిన బిల్లులను ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం చెల్లించకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులను నిలిపివేసారు. దీంతో చాలా రోజులు ఈ పనులు నిలిచిపోయాయి. దీనిపై ఈ ఏడాది ఆగస్టు 27వ తేదీన సాక్షి దినపత్రికలో 'ఎక్కడి పనులు అక్కడే' అనే శీర్షికన కథనం ప్రచురించింది. అయితే దీనికి స్పందించిన అధికారులు ఈ రహదారి నిలిచిపోవడంపై సాక్షిలో ప్రచురితమైన కథనాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పాటూ ప్రభుత్వ పెద్దలు దృష్టికి కూడా తీసుకువెళ్లారు. దీంతో ప్రభుత్వం స్పందించి ఇటీవల ఈ రహదారి పనులకు చెందిన పెండింగ్ బిల్లులు 3 కోట్లు రూపాయలు వరకూ చెల్లించింది. దీంతో కాంట్రాక్టర్ మళ్లీ ఈ పనులను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రహదారి పనులను సంక్రాంతిలోగా పూర్తి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా ధాన్యం సేకరించండి

బొండపల్లి: రైతులకుఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ధాన్యం సేకరణ చేపట్టాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పురం అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. ఇటీవల రెండు తుఫాన్‌లు కారణంగా రైతులు వరి పంటను పూర్తిగా నష్టపోయారని చెప్పారు. కోతలు కోసిన వరి పంటకు నష్ట పరిహారం ఇచ్చే అవకాశం లేదని ప్రభుత్వం కుంటి సాకులు చెబుతూ రైతులను నిండా ముంచిందని, ఇప్పుడు వరి నూర్పులు ముమ్మరంగా గ్రామాల్లో సాగుతున్నాయని చెప్పారు. మిల్లర్లు రంగు మారిన ధాన్యం అని, మొలకెత్తిన ధాన్యం అని చెప్పి అదనపు కేజీలను రైతుల నుంచి డిమాండ్ చేస్తున్నారని, రైతుల నుంచి ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వమే పూర్తిగా రంగు మారిన ధాన్యం, మొలకలు వచ్చిన ధాన్యాన్ని నేరుగా సేకరించి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులను ఆదుకోకుంటే తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

గంజాయితో నలుగురు యువకుల అరెస్టు

కొత్తవలస: బహిరంగ ప్రదేశంలో గంజాయిని పీల్చుతూ అమ్మకాలు సాగిస్తున్న నలుగురు యువకులను కొత్తవలస పోలీసులు సోమవారం అరెస్టు చేసి వారి దగ్గర నుంచి 2.700 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుదర్శన్ తెలిపారు. ఈ మేరకు ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస సంత మార్కెట్ షెడ్డులో నలుగురు యువకులు గంజాయిని పీల్చుతూ అమ్మకాలు చేస్తున్నారని సమాచారం రావడంతో తమ సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. పోలీసులను చూసి పారిపోయేందుకు సదరు యువకులు ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. కొత్తవలస గ్రామానికి చెందిన ఎస్.రవితేజ, వి.అరుణ్‌కుమార్, కె.ఆదిత్య, బాలాజీ, కె.రాంబాబులను పట్టుకుని వారి వద్ద తనిఖీ చేయగా రెండు కేజీల 7వందల గ్రాముల గంజాయి ఉన్నట్లు తెలిపారు. తహసీల్దార్ బి.నీలకంఠరావు సమక్షంలో గంజాయిని సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసి కొత్తవలస కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.



గంజాయితో పట్టుబడిన నిందితులను విలేకరులకు చూపిస్తున్న ఎస్సై సుదర్శన్

అలరించిన నాడు-నేడు మ్యూజికల్ నైట్



జ్ఞాపికలు అందుకుంటున్న గాయనీ, గాయకులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి సీతారామ కల్యాణ మండపంలో నిర్వహించిన నాడు-నేడు మ్యూజికల్ నైట్ ఎంతగానో అలరించింది. ఘంటసాల జయంతి సందర్భంగా సహాయ్ స్వచ్ఛంద సంస్థ, సంగీత స్వరమాధురి ఆధ్వర్యంలో నాడు-నేడు మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మ్యూజికల్ నైట్ కార్యక్రమంలో 30 మంది కళాకారులు పాల్గొని గానగంధర్వుడు ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటలతో అలరించారు. ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఎస్ఎంఎస్ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ డైరెక్టర్ వాకాడ గోపి మాట్లాడుతూ ఘంటసాలను గుర్తు చేస్తూ ప్రతీ ఏడాది ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ గాయకుడు వి.నారాయణ మూర్తిని సన్మానించారు. గాయకులు పాల్గొన్నారు.

పట్టుబడిన పేకాటరాయుళ్లు

దత్తిరాజేరు: మండలంలోని మరడాం గ్రామంలో ఓ ఇంటిలో రహస్యంగా పేకాట ఆడుతూ ఆరుగురు పేకాటరాయుళ్లు సోమవారం సాయంత్రం పట్టుబడినట్లు ఎస్ భూర్జవలస ఎస్ఐ రాజేష్ తెలిపారు. కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలసి వెళ్లి ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1150లు నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

దత్తిరాజేరు: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. దాసుపేట గ్రామంలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. రెవెన్యూ పరమైన సమస్యలకు క్షేత్ర స్థాయిలో సిబ్బంది ద్వారా పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వీఆర్ఓ బలరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

హక్కులపై బాలికలకు అవగాహన తప్పనిసరి

బొండపల్లి: బాలికలు తమ హక్కులపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని వన్ స్టాప్ కేంద్రం ప్రతినిధి టి.అనిత పేర్కొన్నారు. మండలంలోని నెలివాడలోని జిల్లా పరిషత్ హైస్కూలులో సోమవారం వన్ స్టాప్ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా చైల్డ్‌లైను హెల్ప్‌లైను నెంబరు 1098కు ఫిర్యాదు చేసి సహాయం పొందాలని సూచించారు. మైనరు బాలికలకు బాల్య వివాహాలు నిర్వహిస్తే తప్పనిసరిగా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూలు హెచ్.ఎం శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వన్ స్టాప్ కేంద్రం ప్రతినిధి అనిత

కరాటే బెల్టు టెస్టుల్లో కొత్తవలస విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో బెల్టులు సాధించిన విద్యార్థులతో కోచ్

కొత్తవలస: విశాఖపట్నం జిల్లా వేపగుంటలో కనకారావు కరాటే అకాడమిలో ఆదివారం నిర్వహించిన కరాటే బెల్టు టెస్టులో మండల కేంద్రానికి చెందిన ఓకేనావా స్పోర్ట్సు అకాడమి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కోచ్ సూర్యనూకరాజు తెలిపారు. బెల్టు టెస్టులో 10 మంది విద్యార్థులులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. కె.గౌతమ్‌రితిక్, పి.జెస్సికా, ఎ.సాయిసుజన్, ఎల్.అవినాష్‌లు ఎల్లో బెల్టులను, పి.నాగవెంకటవంశీ, పి.గౌరీప్రసన్న గ్రీన్ బెల్టులు, ఇ.శ్రీలక్ష్మప్రసన్న, ఇ.దేవకీలత, ఎం.గోవర్ధన్నలకు మెరిన్ బెల్టులు, ఎం.దేవకీహర్ష గ్రీన్ బ్లూబెల్టులు సాధించినట్లు కోచ్ తెలిపారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



ఆందోళన చేస్తున్న సీపీఎం శ్రేణులు

గజపతినగరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు వి.లక్ష్మి డిమాండ్ చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ జాతీయ రహదారిపై అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అమిత్‌షా తక్షణమే ప్రజలకు క్షమాపణలు చెప్పాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.శ్రీనివాస్, ఆర్.హరికృష్ణ, వేణి, ఎల్.వెంకటరావు, సూర్యనారాయణ, గోవింద, రాములమ్మ, వీరమ్మ, అప్పారావు పాల్గొన్నారు.

కొత్తవలసలో..

కొత్తవలస: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన అవమానకర మాటలను నిరసిస్తూ సీపీఎం నేతృత్వంలో సోమవారం ఆందోళన చేశారు. అరకు – విశాఖ రోడ్డులో పార్టీ కార్యకర్తలతో కలిసి ఆందోళన చేయడంతో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సీపీఎం నాయకుడు గాడి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వి.ఆదినారాయణ, టీవీ రమణ, బండ గణేష్ తదితరులు పాల్గొన్నారు.